సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 5 । జూన్ । 2023



సెబ్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి
శ్రీకాకుళం నగర పరిధిలో సెబ్ కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో



తగ్గిన జీడి..పెరిగిన కోడి
జీడిపప్పు ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు కోడిమాంసం ధరలు అమాంతం పెరిగాయి. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	28°
ఇచ్ఛాపురం	37°	29°
పాతపట్నం	36°	30°
శ్రీకాకుళం	36°	29°

న్యూస్‌రీల్

కొత్త ఎంపీడీఓల నియామకం

అరసవల్లి: తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాలకు కొత్తగా ఎంపీడీఓలు నియమితులయ్యారని, ఒకటి రెండు రోజుల్లోనే బాధ్యతలను స్వీకరించనున్నారని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కొందరు ఏఓ, ఈఓపీఆర్‌డీల నుంచి పదోన్నతులు పొంది ఎంపీడీఓలుగా వస్తున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, జూనియర్ అసిస్టెంట్లు తొమ్మిది మంది, రికార్డు అసిస్టెంట్లు నలుగురు, ఆఫీస్ సబార్డినేట్స్ 18 మంది, నైట్ వాచ్‌మేన్లు ఇద్దరు, స్వీపర్లు ఇద్దరిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసినట్లుగా వివరించారు.

కొత్త ఎంపీడీఓలు వీరే..
ఎస్.రమణయ్య(గార), సీహెచ్.ప్రేమలత(సంతబొమ్మాళి), కె.ఉషశ్రీ(పోలాకి), కె.నిశ్చల(జి.సిగడాం), ఆర్.వి.రమణమూర్తి(రణస్థలం), టి.రమాదేవి(ఎచ్చెర్ల), జి.శివప్రసాద్(నందిగాం), ఎల్.వి.అప్పారావు(జలుమూరు), ఎస్.హనుమంతరావు(ఆమదాలవలస), జి.చంద్రరావు(భామిని), జి.వి.రవికుమార్(సంతకవిటి), ఎం.రవీంద్రబాబు(బూర్జ), వి.తిరుమలరావు(మందస), జి.జయంతుప్రసాద్(వీరఘట్టం).

శ్రీముఖలింగంలో చక్రతీర్థస్నానాలు



పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని చక్రతీర్థస్నానాలు వంశధార నదిలో ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం వంశధార నదిలో స్వామివారి సహిత వారాహి అమ్మవారికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ఏకవార అభిషేకాలు చేశారు. దీంతో స్వామివారి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'యుద్ధమే శాంతి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యం ఏ రూపంలో ఉన్నా అంతిమ లక్ష్యం సమసమాజ నిర్మాణమే అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. శ్రీకాకుళంలోని కథా నిలయంలో ప్రసాదమూర్తి రచించిన దీర్ఘకావ్యం 'యుద్ధమే శాంతి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. ముందుగా కాళీపట్నం రామారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పుస్తక ప్రాముఖ్యతను వివరించారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకులు దుప్పల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు మాటూరి శ్రీనివాస్, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, కంచరాన భుజంగరావు, కాళీపట్నం సుబ్బారావు, దాసరి రామచంద్రరావు, బొడ్డేపల్లి కృష్ణారావు, చింతాడ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో నందిగాం విద్యార్థుల ప్రతిభ



పతకాలతో నందిగాం విద్యార్థులు

నందిగాం: తిరుపతి సమీపంలోని నాయుడుపేటలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తాచాటారు. నాలుగు కిలోమీటర్ల కేటగిరీ అండర్–14 విభాగంలో జి.అభిరాం ప్రథమ స్థానం, కె.గణేష్ ఐదో స్థానంలో నిలిచాడు. ఐదు కిలోమీటర్ల కేటగిరీ అండర్ –18 విభాగంలో బి.మోక్ష ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరికి నగదు, బహుమతులు అందజేసి సత్కరించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు యర్నాగుల హరిబాబు, పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సనపల చిన్నారావు అభినందించారు. మిగిలిన విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

● చెట్టునీడే బంగారు..



వేసవి ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి గాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోయారు. గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలు సైతం ఎండవేడికి తట్టుకోలేక చెట్ల నీడను ఆశ్రయించాయి. ఎల్.ఎన్.పేట మండలం గొట్టిపల్లి చెరువు వద్ద గొర్రెల మంద ఇలా చెట్టు కింద సేదతీరింది. – ఎల్.ఎన్.పేట

● కొండముచ్చులతో కంగారు..



కంచిలి పంచాయతీలో కోతులు, కొండముచ్చుల బెడద ఎక్కువైంది. అటవీ ప్రాంతం నుంచి వచ్చి స్వైర విహారం చేస్తుండటంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయభ్రాంతులకు గురౌతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువుల్ని చిందరవందర చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వంద వరకు కోతులు, కొండముచ్చులు తిరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. – కంచిలి

సొంతింటి కలకు.. మీటర్ల వెలుగు



విద్యుత్ మీటర్ కనెక్షన్లను పరిశీలిస్తున్న ఎస్ఈ దైవప్రసాద్

- జగనన్న కాలనీల్లో జోరుగా ఉచిత విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- జిల్లాలో 25,482 గృహాల నిర్మాణాలు పూర్తి
- ఇప్పటికే 24,589 విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- ఆనందంలో లబ్ధిదారులు



అరసవల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. కేవలం ఇంటి స్థలం ఇచ్చి చేతులు దులిపేసుకోకుండా పునాది స్థాయి నుంచి ప్రారంభం దాకా అడుగడుగునా అండగా నిలుస్తోంది. దీనిలో భాగంగా విద్యుత్ మీటర్లను ఉచితంగా అమర్చుతూ లబ్ధిదారుల్లో ఆనందాల వెలుగులు నింపుతోంది. ఈ ప్రక్రియ జిల్లాలో జోరందుకుంది.

చకచకా మీటర్ల ఏర్పాటు..
సొంత ఇళ్లు లేని పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు మంజూరు చేసింది. ఇప్పటికే కొందరు ఇళ్లను నిర్మించుకుంటే.. మరి కొందరు నిర్మాణాలను వేగవంతంగా చేపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ గృహ యజ్ఞంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ మీటర్లను అమర్చుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 877 లేఅవుట్లకు గాను శ్రీకాకుళం డివిజన్‌లో 239, టెక్కలి డివిజన్‌లో 475, పాలకొండ డివిజన్‌లో 163 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం చేశారు. ఇందులో కోర్టు కేసుల్లో 78, సుడా పరిధిలోని 88 లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 711 లేఅవుట్లలో విద్యుత్ శాఖ విద్యుద్దీకరణ పనులు చేపట్టింది. మొత్తం 179 లేఅవుట్లులో ఇప్పటికే విద్యుత్ పనులు పూర్తయ్యాయి. లేఅవుట్లలో 50,959 ఇళ్లను, సొంత స్థలాల్లో 42,721 ఇళ్లను గుర్తించారు. ఇందులో లేఅవుట్ల స్థలాల్లో 2497 ఇళ్లు పూర్తికాగా 1822 ఇళ్లకు విద్యుత్ మీటర్లను ఉచితంగా అమర్చారు. సొంత స్థలాల్లో 22,985 ఇళ్లు పూర్తి కాగా 22,767 ఇళ్లకు మీటర్లను ఉచితంగా అమర్చారు. మొత్తం 25,482 ఇళ్లకు గాను 24,589 ఇళ్లకు మీటర్లను అమర్చారు.

శత శాతం అందిస్తాం..
జగనన్న కాలనీల్లో వంద శాతం ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లను అందజేస్తాం. ఇప్పటికే పూర్తయిన ఇళ్లతో పాటు ఇళ్ల నిర్మాణాలకు వీలుగా నీటి మోటార్లకు కూడా మీటర్లు అందజేశాం. త్వరలోనే అన్ని ఇళ్లకు మీటర్లు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్య సాధన మేరకు పనిచేస్తున్నాం.
– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ, విద్యుత్ సర్కిల్

జగనన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి..
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న కాలనీల నిర్మాణాల్లో విద్యుత్ శాఖ తన వంతుగా సర్వీసులను అందజేస్తూనే.. ప్రతి కాలనీల్లోనూ విద్యుత్ వెలుగులు నిండాలని ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం స్థానిక సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ విద్యుత్ సర్వీసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందుకోసం ప్రత్యేక బృందంగా అధికారులు జిల్లాలో డివిజన్ల వారీగా లేఅవుట్లను పరిశీలిస్తూ వీలైనంతగా అన్ని కాలనీల రోడ్లకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్)తో పాటు నీటి అవసరాలకు మీటర్ కనెక్షన్లను, ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ మీటర్లను అందజేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు దాదాపుగా విద్యుత్ మీటర్లు అమర్చేశారు. మిగిలిన ఇళ్లకు కూడా త్వరలోనే విద్యుత్ మీటర్లను అమర్చేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. ప్రతి వారం ఈ అంశంపై ప్రగతి నివేదికలను క్షేత్ర స్థాయి నుంచి తెప్పించుకుంటూ, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా సూచనలను, ఆదేశాలను జారీ చేస్తున్నారు.

భానుడి దర్శనానికి బారులు

- అరసవల్లిలో జ్యేష్ఠ ఆదివారం సందడి



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్



కేశఖండన శాల మొక్కుల కోసం క్యూలైన్లలో భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో జ్యేష్ఠ మాస ఆదివారాన వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం తరలివచ్చిన వందలాది మంది భక్తులు తమ కుటుంబాలతో సహా మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణలతో సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొందరు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భానుడి ప్రతాపం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఆలయానికి వచ్చిన ప్రతి భక్తునికి ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రారంభించారు. క్యూలైన్ల వద్ద కూడా మంచినీటిని అందుబాటులో ఉంచారు. కేశఖండన శాలలో భారీగా భక్తులు తరలివచ్చి తలనీలాలు సమర్పించుకున్నారు. మొక్కుచెల్లించుకున్న యలమంచిలికి చెందిన ఓ భక్తుడు క్యూలైన్‌ను దాటేందుకు దూకడంతో తలకు గాయమయ్యింది. వెంటనే ఆలయ సిబ్బంది డాక్టర్ మోహన్‌ను పిలిపించి ప్రథమ చికిత్స చేయించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధా అజిత్, ఎస్.కోటేశ్వర చౌదరి తదితరులు దర్శన ఏర్పాట్లు పరిశీలించారు. ఒక్కరోజులో ప్రత్యేక, విశిష్ట దర్శనాల టికెట్ల ద్వారా రూ.4,60,900, విరాళాలు, పూజల ద్వారా రూ.56,049, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.50 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు.

సృజనకు వీరే సాక్షి

ముగిసిన సాక్షి మీడియా–చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ వేసవి శిక్షణ శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

- చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్, కూచిపూడిలో మెలకువలు నేర్చుకున్న చిన్నారులు
- ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు పంపిణీ
- సాక్షి ప్రయత్నం అభినందనీయం: వక్తలు



శ్రీకాకుళం కల్చరల్ : వేసవి సెలవుల నేపథ్యంలో సాక్షి మీడియా – చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం ఆదివారం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆలయం వద్ద సందడిగా జరిగింది. నెలరోజులు పాటు సాగిన ఈ సమ్మర్‌క్యాంప్‌కు 100 మంది చిన్నారులు హాజరయ్యారు. చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్, కూచిపూడి తదితర అంశాల్లో మెలకువలు నేర్చుకున్నారు. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి' బ్రాంచి మేనేజర్ స్వామి మాట్లాడుతూ చిన్నారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని అద్భుతమైన ప్రదర్శన ఏర్పాటు చేశారని అభినందించారు. టీపీఎంహెచ్ స్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్ నటుకుల మోహన్ మాట్లాడుతూ చిన్నారులు చాలా ఉత్సాహంగా నేర్చుకున్నారని, వారికి బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, బీఎంఎస్ పట్నాయక్, ఎల్.నందికేశ్వరరావు, టి.నీరజా సుబ్రహ్మణ్యం, పెంకి నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, ఎల్.దీప్తి, సాయి ప్రసాద్, మానస, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..
నెలరోజుల పాటు తాము నేర్చుకున్న కళలను ప్రదర్శించి చిన్నారులు ప్రతిభ నిరూపించుకున్నారు. జానపదం, కోలాటం, కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంగీతం నేర్చుకున్న చిన్నారులు పలు గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్ నేర్చుకున్న చిన్నారులు తాము గీసిన బొమ్మలను, చేసిన వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వీటిని చూసేందుకు చిన్నారుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాక్షి బ్రాంచ్ మేనేజర్ స్వామి





చిన్నారులు తయారుచేసిన కళాకృతులు



ఆకట్టుకున్న గ్లాస్ పెయింటింగ్స్

థ్యాంక్స్ టు సాక్షి



నేను కొన్నాళ్లుగా ప్రతి వేసవి శిబిరానికి శిక్షణ కోసం వస్తున్నాను. బొమ్మలు వేయడం చాలా ఇష్టం. శిక్షణలో ఎన్నో మెలకువలు నేర్పారు. నాకు బహుమతి కూడా వచ్చింది. 'సాక్షి'కి ధన్యవాదాలు. – హితీష్, పెయింటింగ్‌లో శిక్షణ పొందిన చిన్నారి

ప్రతిభ వెలికితీసేందుకే..



సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. లాఫింగ్ క్లబ్‌కు నావంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడం మా ఉద్దేశం. 19 ఏళ్లుగా చిన్నారులను వివిధ కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నాం.
– నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

ఆనందంగా ఉంది..



వేసవి సెలవుల్లో డ్యాన్స్ నేర్చుకోవడం ఆనందంగా ఉంది. నృత్యంలో చాలా మెలకువలు నేర్పించారు. చిన్నారులంతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. సాక్షికి ధన్యవాదాలు.
– జ్యోత్స్న, నృత్యం నేర్చుకున్న విద్యార్థి

నాట్యంలో శిక్షణ



నృత్యంలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వాహకులు కోరగా నా శిష్యులను ఇద్దరిని పంపించాను. చిన్నారుల కోసం మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నాట్యంలో చిన్నారులు మెలకువలు నేర్చుకున్నారు.
– టి.నీరజ, అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు

చక్కగా నేర్పించారు..



ఈ వేసవి సెలవుల్లో నా కుమార్తెను నృత్యం నేర్పేందుకు శిక్షణ శిబిరానికి పంపించాను. చాలా చక్కగా నేర్పారు. ప్రతి ఏడాది వేసవి శిబిరాలకు పంపుతున్నాను. సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలి.
– పొట్నూరు శిరీష, విద్యార్థి తల్లి



స్టాల్‌లో కళాకృతులను వివరిస్తున్న చిన్నారులు

● కన్నీటి నివాళి



ఒడిశా రైలుప్రమాద బాధితులకు సంతాపంగా కవిటిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. – కవిటి

మృత్యు పిడుగులు

- వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి
- ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు




మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు (ఇన్‌సెట్లో) పద్మావతి (ఫైల్)



చిన్నప్పన్న (ఫైల్)

బూర్జ: జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతిచెందారు. బూర్జ మండలం లాభాం గ్రామానికి చెందిన నక్క పద్మావతి (5) ఆదివారం సాయంత్రం ఆవును మేపేందుకు గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. ఈ సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో పద్మావతి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు సైతం మృత్యువాతపడింది. పద్మావతికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికి వివాహాలు అయ్యాయి. భర్త చిన్నరామయ్య రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్దకుమారుడు నక్క కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తూలుగు పంచాయతీలో..
గార: గార మండలం తూలుగు పంచాయతీకి చెందిన కొయ్యాన చిన్నప్పన్న (48) పిడుగుపాటుకు గురై మృతిచెందారు. పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో చిన్నప్పన్నపై పిడుగుపడింది. కొనఊపిరితో ఉన్న చిన్నప్పన్నను ఇంటికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించినప్పటికి ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే విధంగా, గ్రామ సమీపంలోని వాడపాలెంలో లాడి నాగభూషణరావు ఇంటిపై పిడుగు పడడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందారు. ఎవరికీ ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈదురుగాలుల బీభత్సం
మెళియాపుట్టి: ఆంపురం పంచాయతీ పెంగువాడలో శనివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పెద్దబొంతు కాంతమ్మ, జగదాంబలకు చెందిన ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరారు.



పెంగువాడలో ఎగిరిపడిన ఇంటి రేకులు

క్లుప్తంగా

నేటి నుంచి ట్రిపుల్ ఐటీ తరగతులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: వేసవి సెలవుల అనంతరం శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) సోమవారం పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు తరగతి గదులు, వసతి గృహం సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను పరిపాలన అధికారి ముని రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

నేటితో ముగియనున్న పాలిసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: గత నెల 29న ప్రారంభమైన పాలిసెట్ -2023 కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన సోమవారంతో ముగియనుంది. చివరి రోజు 108001 నుంచి చివరి ర్యాంకు వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. ఈ నెల ఆరు వరకు ఆప్షన్ల ఎంపిక కొనసాగనుంది.

ఆదిత్యుని దర్శించుకున్న విశాఖ నగర సీపీ



సీపీ వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాకు ఎస్పీగా పని చేసినప్పటి పరిస్థితులను గుర్తుతెచ్చుకున్నారు. ఈయన వెంట వన్‌టౌన్ సీఐ ఎల్ఎస్ నాయుడు, ఎస్సై బలివాడ గణేష్ ఉన్నారు.

జిల్లా అండర్-9 చెస్ ఎంపిక పోటీలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-9 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఈ నెల 6న నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో ఉన్న జిల్లా చెస్ కోచింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. 2014 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 23 నుంచి కృష్ణా జిల్లాలో జరిగే ఏపీ రాష్ట్ర అండర్-9 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఎంట్రీ ఫీజుగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు ఏపీచెస్.ఆర్గ్ వెబ్‌సైట్‌ను గానీ, 9912559735 నంబర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE: VIKARABAD, AT::VIKARABAD
O.S.NO. 561 OF 2022
Between:
KAVALI MAMATHA and another ...Plaintiffs
AND
The Tahasildar, Kotepally Mandal and 5 others. ... Defendants
NOTICE
To,
1. Karri Lalitha, W/o Ramu,
2. Karri Apparna, D/oLalitha,
3. Karri Sandeep, S/o Lalitha
Above all are R/o H.No. -51, Main Street, SanthaBommali, Kota Bommali, Srikakulam District, A.P. 532-195.
Please take notice that the above Suit filed for Declaration of title and declaration of legal heirs against above mentioned addressee no. 1 to 3 over the Sy no. 286/1/1, Ac. 1-00 Gts 286/ 1/2, Ac. 0-36 Gts, situated at Barwad Village, Kotepally Mandal, Vikarabad District. The said suit is posted for your appearance on 13-06-2023 at 10:30 A.M. If you do not appear in person or through your counsel on the said date, the case will be heard and determined in your absence.
(BY THE ORDER OF THE COURT)
Sd- B. Srinivas, Advocate
O/o. H.No.9-1-43/53/17/C, Prashanth Nagar, Langar House, Hyderabad, Cell. 9848797792
Email: srinivas.boyeni@gmail.com

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE: VIKARABAD, AT::VIKARABAD
I.A NO. 698 OF 2022
In
O.S.NO. 561 OF 2022
Between:
KAVALI MAMATHA and another ...Petitioner/Plaintiffs
AND
The Tahasildar, Kotepally Mandal and 5 others. ...Respondent/Defendants
NOTICE
To,
1. Karri Lalitha, W/o Ramu,
2. Karri Apparna, D/oLalitha,
3. Karri Sandeep, S/o Lalitha
Above all are R/o H.No. -51, Main Street, SanthaBommali, Kota Bommali, Srikakulam District, A.P. 532-195.
Please take notice that the Petitioner/ Plaintiff filed the main suit for Declaration of title and declaration of legal heirs against you above mentioned addressee no. 1 To 3 over the Sy no. 286/1/1, Ac. 1-00 Gts 286/1/2, Ac. 0-36 Gts, Situated at Barwad Village, Kote pally Mandal, Vikarabad District. It is to state that I.A no. 698 of 2022 filed for ad interim injunction petition schedule land and the said I.A is posted for your appearance on 13-06-2023 at 10:30 A.M. If you do not appear in person or through your counsel on the said date, the case will be heard and determined in your absence.
(BY THE ORDER OF THE COURT)
Sd- B. Srinivas, Advocate
O/o. H.No.9-1-43/53/17/C, Prashanth Nagar, Langar House, Hyderabad, Cell. 9848797792 Email: srinivas.boyeni@gmail.com

తగ్గిన జీడి.. పెరిగిన కోడి

- వారం వ్యవధిలో కిలో జీడిపప్పుపై రూ.150 వరకు తగ్గుదల
- అమాంతం పెరుగుతున్న చికెన్ ధరలు

కాశీబుగ్గ/శ్రీకాకుళం:

మార్కెట్‌లో జీడిపప్పు ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జాతీయ మార్కెట్‌లో సంక్షోభంతో జీడిపప్పు అమ్మకాలు వారం రోజులుగా గణనీయంగా పడిపోవడంతో పరిశ్రమదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలాస, ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో సుమారు 400 జీడి పరిశ్రమలు ఉనఆనియ. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో జీడిపప్పు వాడకం తగ్గడంతో పాటు, మండుతున్న ఎండలు ధరల పతనానికి కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. మొదటి రకం జీడి(గుడ్డు) ధర వారం రోజుల వ్యవధిలో కిలోపై రూ.150 వరకు తగ్గింది. వివిధ రకాల జీడిపప్పు, బద్ద, గుండ సుమారు రూ.75 వరకు తగ్గింది. ధరల తగ్గుముఖంపై పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం మాట్లాడుతూ ఏటా పెరిగే సమయంలో ఈసారి ధరలు తగ్గిపోయాయని చెప్పారు.



పలాసలో తయారైన దేశీ జీడిపప్పు



కోళ్లు

జీడిపప్పు రకం	మే ధర	జూన్(రూ.)
210 (గుడ్డు)	800	650
240	640	560
320	600	520
400	570	490
311	540	460
జేహెచ్ (బద్ద)	565	485

రకం	20 రోజుల కిందట	ప్రస్తుతం (రూ.లలో)
లైవ్ చికెన్	105	152
స్కిన్	160	274
స్కిన్ లెస్	185	284
కోడిగుడ్డు	5	6

కొండెక్కిన కోడి

మాంసాహార ధరలు మాత్రలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 20 రోజుల క్రితం ధరలతో పోల్చితే చికెన్ ధర రూ.80, గుడ్డు ధర రూపాయి, చేపలు ధర రకాలను పట్టి రూ.80 నుంచి రూ.100 వరకు పెరిగాయి. వేసవి కాలంలో ఇలా ధరలు పెరగటం సాధారణమే అయినా ఈ ఏడాది పెరుగుదల విపరీతంగా ఉంది. వేసవిలో వ్యాధులు సోకుతాయన్న కారణంగా పౌల్ట్రీ యజమానులు సీజన్‌లో తక్కువగా కోళ్లను పెంచుతారు. ఫలితంగా ధర పెరుగుతోంది. అలాగే ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నుంచి కిలోన్నర కోళ్ల మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. వాస్తవంగా పౌల్ట్రీ యజమానులు కోడి బరువు రెండు కిలోలు దాటిన తరువాత మాత్రమే విక్రయిస్తుంటారు. ఇప్పుడు కోళ్లకు డిమాండ్ పెరగటంతో కిలో కోళ్లనే విక్రయిస్తున్నారు. వీటి రుచి కూడా తగ్గుతోందని మాంసాహార ప్రియులు చెపుతున్నారు. జిల్లాలో ఉన్న డిమాండ్‌కు తగినట్టుగా ఉత్పత్తి లేకపోవటంతో పొరుగు రాష్ట్రమైన ఒడిశా నుంచి కోళ్లను దిగుమతి చేసుకోవటంతో ధర పెరుగుతోంది. వేట మాంసం, చేపల ధరలు సైతం ఇలాగే పెరుగుతున్నాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలి జస్టిస్ యతిరాజులు



జస్టిస్ యతిరాజులును సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యతిరాజులు ఇటీవల నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి రాష్ట్ర పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో పౌరసన్మానం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, నాటక రచయితగా, ఆధ్యాత్మికంగా, ట్రస్టు ద్వారా ఎన్నో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎన్నో న్యాయపరమైన విధులు నిర్వహించి ఎక్కడా మచ్చలేకుండా నిలిచిన వ్యక్తిని గౌరవించుకోవడం మన అదృష్టమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత యతిరాజులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వృత్తిపట్ల నిబద్ధతతో ఉంటే తప్పక విజయం చేకూరుతుందన్నారు. ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి, తెలంగాణా హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జయంతిలు మాట్లాడుతూ యతిరాజులును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా జస్టిస్ చంద్రయ్యను సత్కరించారు. అనంతరం జస్టిస్ జి.యతిరాజులను సన్మానించారు. ఈ సందర్భంగా మెహర్ నృత్య కళానికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు జస్టిస్ యతిరాజులును మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి దంపతులు నారాయణ తిరుమలలో సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.తులసీరావు, జెమ్స్ ఆస్పత్రి వ్యవస్థాపకులు కనుగుల సుధీర్, జస్టిస్ పప్పల జగన్నాథరావు, సన్మాన కమిటీ సభ్యులు దుప్పల వెంకటరావు, సుగుణాకర్, జయరాం, చిట్టి వెంకటరావు, పన్నాల నర్సింహమూర్తి, పి.వెంకటరావు, నటుకుల మోహన్, నారాయణ తిరుమల వేంకటరామానుజ సేవాదళం సభ్యులు గురుగుబెల్లి శ్రీనివాస్, పైడి చందు, దుర్గాప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాక్సింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్ (అను) ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. 44 కేజీల నుంచి 80 కేజీల విభాగాల మధ్య ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, ఆర్.గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికచేసిన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపించనున్నట్టు లక్ష్మణ్‌దేవ్ చెప్పారు.



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా బాక్సింగ్ కోచ్ ఉమా, రాజీవ్, గణేష్

ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగం ఎం.శ్రీనివాస్ (48 కేజీల కేటగిరి), పీవీ సాగర్ (50 కేజీలు), ఎం.పార్థసారథి (52 కేజీలు), ఎ.చరణ్‌కుమార్ (57 కేజీలు), డి.నవీన్ (60 కేజీలు), బాలికల విభాగంలో ఎ.నశీమ, జె.సుధారాణి.

నీలమణిదుర్గ సన్నిధిలో స్పీకర్ తమ్మినేని



అమ్మవారికి దర్శించుకున్న స్పీకర్ సీతారాం కుటుంబసభ్యులు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారిని స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు గౌరవపూర్వకంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి స్పీకర్ దంపతులకు జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ అభివృద్ధికి స్పీకర్ రూ.50 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో రాధాకృష్ణ, పీఎసీఎస్ అధ్యక్షులు శ్యామ్‌సుందరావు, సూర్యనారాయణ, బాలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు లింగాల రవికుమార్, కాళ్ల రాజు, ఎస్.మధుబాబు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'కన్యాకుమారి' షూటింగ్

నరసన్నపేట: గ్రామీణ ప్రాంత ప్రేమ కథ ఆధారంగా కన్యాకుమారి చిత్రాన్ని జిల్లాలో పలు ప్రాంతాల్లో చిత్రీకరించామని, ఆదివారంతో షూటింగ్ పూర్తయిందని దర్శకుడు దామోదర్ (అట్టాడ సృజన్ కుమార్) తెలిపారు. చివరగా కోమర్తి, వీఎన్‌పురంలో హీరో, హీరోయిన్‌పై షాట్లు తీశామని చెప్పారు. డిసెంబర్ 5న శాలిహుండం కొండపై వేణుగోపాలస్వామి ఆలయం వద్ద చిత్ర షూటింగ్ ప్రారంభించామన్నారు. అనంతరం హీరో శ్రీ చరణ్, హీరోయిన్ గీత్ షైనీలుమాట్లాడారు. గడిచిన ఆరు నెలల్లో 90 రోజుల పాటు ఐదు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని తీశామని వివరించారు. నరసన్నపేట, పోలాకి, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం టౌన్, జలుమూరు తదితర ప్రాంతాల్లో అందరూ సహకరించారని చెప్పారు. సినిమాను జిల్లా ప్రజలు ఆదరించాలని కోరారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు.



వీఎన్‌పురంలో చిత్రం యూనిట్

క్షతగాత్రులకు వైద్యసాయం

అరసవల్లి: ఒడిశాలో రైళ్ల ప్రమాద క్షతగాత్రులకు జిల్లా వైద్యారోగ్య శాఖ బృందం రెండు రోజులుగా సేవలందిస్తోంది. ప్రత్యేక ఎమర్జెన్సీ నోడల్ అధికారి డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ కొయ్యాన అప్పారావు, డాక్టర్ కార్తిక్ తదితరులతో కూడిన బృందం ఇప్పటికే సేవలు ప్రారంభించారు. బాలాసోర్‌లోని అపోలో ఆసుపత్రిలో వందలాది మంది క్షతగాత్రులుండగా..వారికి చికిత్స అందిస్తున్నారు. ఇదిలావుంటే శనివారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఒడిషా పర్యటనలో భాగంగా స్థానిక జిల్లా నుంచి వెళ్లిన ఈ ఎమర్జెన్సీ బృందం కూడా మంత్రితో పాటు వెళ్లి క్షతగాత్రుల పరిస్థితులను చూసి అక్కడికక్కడే చికిత్సలను అందజేసారు.



క్షతగాత్రులకు చికిత్స అందజేస్తున్న జిల్లా వైద్యులు

నేటి నుంచి అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు

అరసవల్లి: జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు అతిసార వ్యాధి నివారణ లక్ష్యంగా ఈ నెల 5 నుంచి 17 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. పక్షోత్సవాల్లో చేపట్టాల్సిన చర్యలపై ఇప్పటికే అన్ని రూరల్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌కు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లను సరఫరా చేసినట్టు వివరించారు. పిల్లల తల్లులకు, కుటుంబసభ్యులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశావర్కర్, ఏఎన్ఎంకు సమచారామివ్వాలని సూచించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,760-00
బంగారం(22సి. 10గ్రా.)	55,700-00
వెండి (కిలో)	77,600-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹ 284

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసన్నపేట: మండలంలోని కొత్త పోలవలసకు చెందిన దూగాన విశ్వేశ్వరరావు (34) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువుల వివాహానికి హాజరై శనివారం రాత్రి ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సులో ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, రెండేళ్ల బాబు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని నరసన్నపేట పోలీసులు తెలిపారు.



మృతుడు విశ్వేశ్వరరావు

మనస్థాపంతో వృద్ధుడి ఆత్మహత్య

నరసన్నపేట: మండలంలోని బాలసీమ గ్రామానికి చెందిన మల్ల తవిటయ్య(64) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. మూడో కుమార్తె ఇంటి నుంచి వెళ్లి పోయి తిరిగి రాకపోవడంతో మనస్తాపంతో శనివారం ఉదయం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు నరసన్నపేట ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తవిటయ్య (ఫైల్)

బైకు నుంచి జారిపడి మహిళ మృతి

పొందూరు: మండలంలోని అలమాజీపేటకు చెందిన కూన భారతి(55) అదే గ్రామానికి చెందిన గెడ్డవలస హరనాథరావు బైక్‌పై శనివారం దళ్లవలసలో బ్యాంకుకు వెళ్తుండగా ఎస్‌జీఎస్‌పేట సమీపంలో జారిపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారతిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు కూన అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



భారతి(ఫైల్)

సెబ్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ పప్పల శ్రీనివాసరావు, క్లూస్ టీమ్



తలగాన జగన్నాథం

శ్రీకాకుళం క్రైమ్ : సెబ్ కానిస్టేబుల్ అనుమానాస్పదంగా మృతిచెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. పీఎన్ కాలనీ ఏడో లైన్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్న తలగాన జగన్నాథం(52) న్యూ కాలనీలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్‌లో రెండు నెలలుగా అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఈయన మెళియాపుట్టి మండలం వసుంధర చెక్‌పోస్టులో పనిచేసేవారు. ఈయనకు భార్య రాజ్యలక్ష్మి, ఎమ్మెస్సీ చదివిన కుమారుడు ఉన్నారు. మద్యం అతిగా అలవాటు ఉండటంతో సరిగ్గా విధులకు వెళ్లేవారు కాదు. మే 16 నుంచి విధులకు వెళ్లక ఇంటికి అప్పుడప్పుడూ వెళ్తూ.. ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి తిరుగుతుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 3న శ్రీకాకుళం సింహద్వారం వద్ద మత్తులో తిరుగుతుండటాన్ని ఇంటి యజమాని కుమారుడు చూసి బండి మీద దింపేస్తానంటూ ఎక్కించినా.. వెంటనే దిగిపోయారు. ఇంతలో ఆదివారం ఉదయం కవితా స్కూల్ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో విగతజీవై పడివుండటంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సందీప్‌కుమార్‌లతో పాటు క్లూస్ టీమ్ చేరుకున్నారు. సెబ్ సీఐ నాగేశ్వరరావు సైతం అక్కడికి చేరుకున్నారు. శరీరంపై ఎక్కడా గాయాలు కనిపించలేదు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఘటనా స్థలానికి భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు హరికృష్ణ చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతి పట్ల సెబ్ జేడీ విజయనాగమణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ గోపాల్‌లు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థులకు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అండగా ఉంటుందని సంఘ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయ ఆచారి అన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి 60 మంది విద్యార్థులకు ఆదివారం శ్రీకాకుళంలోని జ్యోతిరావుపూలే కాలనీ(కంపోస్టు కాలనీ)లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తాలాబత్తుల దుర్గాప్రసాద్, ఎం.ఆర్.ఆర్.సీహెచ్ కుమార్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం, సింహాద్రి గోపాలకృష్ణ, తామాడ సత్యనారాయణ, వజ్రాల విష్ణు, చలపాక సూర్యారావు, అండలూరి గణపతి ఆచారి, పొన్నాడ రమణమూర్తి, సాతివిల్లి శ్రీనివాసరావు, చిన్నయ్యాచారి, అనుపోజు శ్రీధర్, మంతిన హరనాథరావు, పొట్నూరు శ్రీనివాసరావు, సుగంధం సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం సజావుగా ముగిసింది. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో 360 మందికి గాను 350 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎచ్చెర్లలో వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో రెండు షిఫ్టుల్లో 149 మందికి 146 మంది హాజరయ్యారు. మొత్తం 509 మందికి గాను 496 మంది విద్యార్థులు హాజరయ్యారు.



శివానీ కాలేజీలో విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

జిల్లా క్రికెట్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

- జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గం స్పష్టీకరణ
- అధ్యక్షులుగా పుల్లెల శాస్త్రి, కార్యదర్శిగా హసన్ రాజా నియామకం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాలో క్రికెట్‌కు పూర్వవైభవాన్ని తీసుకొస్తామని జిల్లా క్రికెట్ సంఘం నూతన అధ్యక్షుడు పుల్లెల శాస్త్రి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జిల్లా క్రికెట్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా పుల్లెల శాస్త్రి, కార్యదర్శిగా హసన్ రాజా, ఉపాధ్యక్షులుగా టి.బాలమురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ప్రవీణ్‌కుమార్, బెనర్జీ, కోశాధికారిగా కేఎస్ఎం శైలానీ, కౌన్సిలర్‌గా సువ్వారి రవికుమార్‌తో పాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 13 ఏళ్ల నిరీక్షణ తర్వాత, అనేక న్యాయ పోరాటాలతో జిల్లాలో క్రికెట్ సంఘం మళ్లీ ఏర్పాటైందన్నారు. రానున్న మూడేళ్లలో సిక్కోలు నుంచి కనీసం ఒక క్రికెటరైనా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా అడుగులు వేస్తామన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల క్రికెట్ మైదానం కోసం ప్రభుత్వం, ప్రిన్సిపాల్‌తో ఎంఓయూ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బీడీపీ సాగర్, ఎన్నికల పరిశీలకులుగా హాజరైన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ రఫీ అహ్మద్ కిద్వాయన్ మాట్లాడుతూ జిల్లా నుంచి 19 ఏళ్లకే క్రికెటర్లు రంజీ ఆడేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ క్రికెటర్ ఇలియాజ్ మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి, అసోసియేషన్ గెలుపునకు, సంఘం ఏర్పాటుకు మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎంతగానో సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో పూర్వపు కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, బాలమురళీ కృష్ణ, సీహెచ్ భాస్కర్, లాల్, దివాకర్, ఎస్‌బీఐ మధు, ఆర్‌సీ రెడ్డి, ఎంఎస్ దీపక్, వర్ధన్, బెండి సురేష్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER
■ SSC CHSL & ALL COMPETITIVE Exams (EM). New Batches on (05.06.2023) @ 9 to 12 pm & 5 to 8 pm. SURYAACADEMY, GURAJADA Road, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V- 6151]

PLOT FOR SALE
■ గజపతినగరం, భూదేవిపేట హైవే పక్కన 30 అడుగుల రోడ్డు ప్రక్కన వెయి గజాల ఫెన్సింగ్ లో ఉన్న స్థలం అమ్మకానికి సిద్ధంగా ఉంది. మధ్యవర్తులు కాకుండా డైరెక్ట్‌గా పార్టీలు సంప్రదించవచ్చు. ఫోన్ : 9652227207 [H.29593]

WANTED
■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786385]
■ హైదరాబాద్‌లో 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సెక్యూగార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను రూం+భోజనం ఫ్రీ జీ: 15,000/- - 30,000/- 7981515640/ 9989930582 [H-781315]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7995984445 [HA-231]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:16K-18K. ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9640258899 [HA-250]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.